# ఉంగరం దొరికింది

ఉషాబాల

ఆఫీసు నుంచి వచ్చేసరికి ఇల్లంతా గందరగోళంగా ఉంది. అత్తగారు చీర చెరగు పైకిదోపి సోఫాల కిందా మంచాల కింద దూరి మరీ దేనికోసమో వెదుకుతున్నారు. మా తోటికోడలు వంటింట్లో డబ్బాలన్నీ బోర్లించేసి అటూ ఇటూ కలియదిరిగేస్తూ తలుపుసందుల్లోకి తొంగిచూస్తూ వంటింటి తూము దగ్గర నుంచి చీపురుతో ఊడ్చేస్తూ తెగ టెన్షన్ ఫీలయిపోతోంది.

మా చిన్నాడబడుచు 'లల్లీ' మాత్రం తనకేం పట్టనట్లుగా బబుల్‌గమ్ నములు కుంటూ ఏదో పుస్తకం పట్టుకుని వరండాలో కుర్చీలో రిలాక్స్‌డ్‌గా కూర్చుంది. వీళ్ళెవరూ నా ఉనికిని పట్టించుకున్నట్లు లేరు.

వాళ్ళ వాలకం చూసి నేనే విషయం ఏంటని ఆరాతీ ద్దును కదా 'లల్లీ డైమండ్ రింగ్ కనిపించడం లేదని' దాన్ని వెదకటం కోసమే ఈ హడావుడి అంతా అని తెలి సింది. కింద కూర్చుంటే ఇద్దరు సాయం పడితేగాని లేవ లేని భారీకాయంతో రకరకాల ఆసనాలు వేస్తూ ఆపసో పాలు పడుతూ నేలంతా తన సెర్చిలైట్‌లాంటి కళ్లతో ఉంగరం కోసం వెదుకుతున్న అత్తగారి అవస్థ చూసి నవ్వొచ్చింది.

వాళ్లకి ఇతోధికంగా సాయంచేసే ఉద్దేశంతో నేనూ వీరనారిలా రంగంలోకి దూకి వెదకడం మొదలుపె ట్టాను. పోపులడబ్బా దగ్గర నుంచి పరుపుల కింద వరకూ మా వెదుకుడు కార్యక్రమం సాగుతూనే ఉంది. ఇంటిముందున్న పది గజాల స్థలాన్ని కూడా వదల కుండా అణువణువూ వెదికాము. అసలు అంత దూరం ఉంగరం ఎలా ఎగురుతూ వెడుతుందన్న ఆలోచనే మాకు రాలేదనుకోండి. అది వేరే విషయం. ఈ లోపు మా ఆయన వేలాయి మొహంతో ఆఫీసు నుంచి అలసి పోయి యింటికి వచ్చారు. బహుశా ఆయనకి తెలీకుం దానే మేం ఇల్లు మార్చే కార్యక్రమం చేపట్టామేమో అని డౌటొచ్చినట్టుంది. అయినా ఆయన రెక్కల కష్టంతో కట్టించుకున్న ముచ్చటయిన ఇల్లు కదా అలా మారి పోరే అనుకుంటున్నారో ఏమో ఆయన ముఖంలో చద వడానికి వీలుకానన్ని భావాలు.

సరే ఎందుకింకా ఆయన్ని ఇబ్బంది పెట్టడం అని నేనే విషయం చెప్పాను. "మీరు మీ ముద్దుల చెల్లెలికి 10వ తరగతి రేంక్ వచ్చిన శుభ సందర్భంలో కొనిపె ట్టిన వజ్రపుటుంగరానికి రెక్కలొచ్చాయి" అన్నాను. పిల్లలు క్రికెట్ ఆడుకుంటూ పక్కింట్లో బాల్ పడిపో యింది నాన్నా అంటే వెళ్ళి తెచ్చుకోండ్రా అన్నప్పుడు తండ్రి మొహంలో కనిపించే కాజువల్ ఫీలింగ్‌తో "అందుకేనా రెక్కలొచ్చిన ఉంగరాన్ని అటకల మీద కూడా వెదికేస్తున్నారు" అన్నారు నవ్వుతూ.

మా ఆయనలో నాకు బాగా నచ్చిన గుణం అదే. మిన్ను విరిగి మీద పడ్డా కంగారు పడరు. మిగతా ఇంట్లో వాళ్ళేమో స్టీల్ చెంచా పోయినా, బందిపోటు ముఠా ఇంటిమీదకు వస్తున్నట్లు కాలనీలో అందర్నీ అలర్టు చేస్తారు.

"అదెలా పారేసుకున్నావే లల్లీ" ముద్దుల చెల్లెలి తల నిమురుతూ అడిగారు.

"ఏమో అన్నయ్య పొద్దున్న స్నానం చేస్తున్నపుడు చూసుకున్నాను. వేలికి లేదు. అప్పట్నుంచీ అందరూ వెదుకుతున్నారు. దొరకలేదు" ముద్దపప్పు అన్నం ముద్ద నోట్లో పెట్టుకున్నట్టుగా ముద్దు ముద్దుగా సమాధానం చెప్పి పుస్తకంలో తల దూర్చింది మళ్ళీ. అవును మరి ఇంజనీరింగ్ పూర్తి చేసి తన కలల రాకుమారుడికోసం ఎదురుచూస్తున్న లల్లీ ఆమాత్రం బాధ పడడం మా ఆయనకి సిల్లీగా అనిపించినా "ఎక్కడికి పోతుంది లేమ్మా. అది నా కష్టార్జితం. ఇక్కడే ఎక్కడో ఉంటుంది" అన్నారు.

"ఎక్కడ దొరకడం నాయనా పొద్దుణ్నించీ వెదికిన వాళ్ళం వెదకినట్టే ఉన్నాం. అది నువ్వు చేయించిన ఉంగరమేమో మరీ బాధపడిపోతోంది. పొద్దున్నుంచీ తిండి తిప్పలు లేకుండా ఎలా కూర్చుందో చూడు" చెల్లెలి సెంటిమెంట్‌తో కొట్టారు మా అత్తగారు.

ఆ దెబ్బకి లుంగీ మడచి మావారు కూడా సెర్చింగ్ ప్రోగ్రాంలో జాయినయ్యారు. అవునూ అత్తగారేంటి లల్లీకి తిండీ తిప్పలూ లేవంటారు? ఇపుడేగా కాఫీ టిఫి నీలు అందించారు. మరి ఆవిడ దృష్టిలో తిండీ తిప్పలు అంటే ఏవిటో? సరే ఆ గొడవ నాకెందుకులే అను కుంటూ నా పనిలో పడ్డాను.

"అవునత్తయ్యగారూ నరసమ్మని ఉంగరం విషయ మేమైనా అడిగారా?" అన్నాను.

అంతే ఆవిడకి ఛర్రున కోపం వచ్చింది. "నువ్వసలు ఏవిటనుకుంటున్నావ్? అది నేను కాపరానికొచ్చినా ట్నించీ చేస్తోంది. పాతికేళ్ళుగా చీపురుపుల్ల పోయినా తెచ్చిస్తుంది. దాన్ననుమానిస్తే మనల్ని మనం అనుమా నించుకున్నట్టే" ఉరుము మీదపడ్డ మంగలంలా విరు చుకు పడ్డారు.

"అదికాదండీ నా ఉద్దేశం. దాన్ని తీసావా అని అడ గమని కాదు. చూసావా అని అడగమన్నానంతే" ఆవిడ ధాటికి హడలిపోతూ చెప్పాను. "అవ్వ పేరే ముస లమ్మ" ఖంగున మోగిందావిడ కంఠం.

ఇంట్లో మనుషులకన్నా పనిమనుషుల మీద ఉన్న ఆవిడ నమ్మకానికి జోహార్లర్పించలేకుండా ఉండలేకపో యాను. ఇదంతా వినోదంలా చూసి 'చిరంజీవి' నవ్వి నంత అందంగా నవ్వుతూ నిలబడ్డ మా ఆయన్ని చూస్తే ఒళ్లు మండింది. మరిక ఈ పూటకి మా అత్తగారు కాని, తోటికోడలు కాని వంటింట్లోకెళ్లే ఛాయలు కనిపించక పోవడంతో వంట చెయ్యడానికి వంటింట్లో దూరాను.

ఆ రాత్రి అందరికీ కాళరాత్రి అయ్యింది. కళ్ళు మూసినా తెరిచినా తళతళలాడుతున్న వజ్రపుటుంగ రమే. మరొకటి కల్లోకొచ్చినా రానిచ్చేట్టు లేదు మా అత్త గారు.

గట్టిగా మాటలు వినిపించడంతో కలత నిద్రలోంచి గబుక్కున లేచి కళ్ళు నులుముకుంటూ పెరట్లోకి వచ్చాను. నరసమ్మ అత్తగారి చేతుల్లో ఉంగరం పెడు తున్న మనోహర దృశ్యం. డిటెక్టివ్‌తో పనిలేకుండా మిస్టరీ వీడిపోయిన ఫీలింగ్ కలిగింది నాకు. "అమ్మా వీధి పాచి చేస్తుంటే ఏవిటాని చూసానమ్మా. పాపగారి ఉంగరంలా ఉంది. ఇదిగోండమ్మా. ఖరీదైనవి అలా పారేస్తే ఎలాగమ్మా" అంటూ మా అజాగ్రత్తమీద ఓ సెటైరేసి పన్లోకెళ్లింది. అపుడు మా అత్తగారి ముఖంలో చూడాలి వెయ్యి మతాబులు వెలిగించినంత కాంతి. ఆర్నెల్ల తరువాత రావలసిన దీపావళి ఇపుడే మా యింటికి వచ్చిందా? అనిపించింది.

"చూసావా పని మనిషి అయినంత మాత్రాన ప్రతి మనిషిని అనుమానించకూడదు" ఆవిడ పెదవి విప్పి ఏమీ అనకపోయినా అదే భావం కనబడిందావిడ చూపుల్లో.

రొటీన్‌గా పనిలో పడ్డాను కాని, ఎందుకో నాకు నర్సమ్మ మాట నమ్మబుద్ధి కాలేదు. ఇంట్లోనూ, బయట తిప్ప తిరగేసి వెదికాము ఎక్కడా లేందీ దీనికెక్కడ దొరి కింది అనుకుంటూ అత్తగారు దేవుడికి స్తోత్ర పారా యణ మొదలుపెట్టినట్టు నిర్ధారణ చేసుకుని నర్సమ్మని పక్కకి పిలిచాను.

"ఏంటమ్మా పిలిచారు" అంటూ వచ్చింది. దాని కళ్లల్లో బెదురు కొట్టొచ్చినట్టు కనిపించింది.

"అహ ఏం లేదు నర్సమ్మా! మాకు కనబడని ఉంగరం నీకెలా దొరికిందీ" అని సౌమ్యంగానే అడి గాను. దానికి మొదట్నుంచీ నేనంటే గౌరవం. దాని

కుటుంబ విషయాలు కూడా నాకు చెప్పి సలహా అడుగుతూ ఉంటుంది. అలాంటిది నేను ఆరాగా అడిగేసరికి కళ్ళనీళ్లు పెట్టుకుంటూ చెప్పింది.

"అమ్మా సేసిన పాపం సెపితే పోద్ది. నిన్న నేను బట్టలుతుకుతూంటే అమ్మాయిగారి బట్టల్లోంచి కావల్న ఉంగరం జారి పడింది. దాని ఇలువెంతో నాకు తెల్దు కానీమ్మా ఉంగరం చూసేసరికి బుద్ధి మారి దాన్ని ఇంటి కట్టుకెళ్ళాను. అట్టుకెళ్ళానన్నమాటేగాని దాన్నెక్కడ దాచాలో బజార్లో ఎలా మార్చాలో తెలీదమ్మా. ఇన్నేళ్ళయి మీ ఉప్పు తింటూ మీ ఇంట్లో దొంగతనం నాకే సేటిమోని కూడా అన్పించిందమ్మా. అలా అనుకుంటూనే పొద్దున్నే పన్లోకొచ్చేటప్పుడు నా కాలు ఎండి పట్టాగొలుసు పడిపోతే తీసి గూట్లో పెట్చొచానుగందా అని దానికోసం ఎదికితే అది పెట్టినచోటలేదు. ఉంగరం ఊసు మర్చిపోయి పట్టాకోసం ఎదుకుతూ బువ్వ కూడా తినకుండా నిద్దరోయానమ్మా. అర్ధరాత్రి పెద్ద కేకలేసుకుంటూ నా మొగుడు ఇంట్లోకొచ్చాడు. ఆణ్ని సూసేసరికే నాకిసయం తెలిసిందమ్మా. పట్టా అట్టుకెళ్లి అమ్మి తాగొచ్చినట్టున్నాడు. ఆ టయింలో అణ్ని కదపటం నాకే సేటని మాటాడకూరుకున్నానమ్మా. కానీ తెల్లార్లూ ఆ ఉంగరమే నా కళ్ళల్లో ఉందమ్మా. కాలి పట్టానే కాపాడుకోలేకపోయా. ఇంత కరీదైన ఉంగరం ఆడు ఉండనిస్తాదా? తెగనమ్మి తాగి రాదూ? నాకేవన్నా పిల్లా, పీసా? అల్లకోసం ఈ పనిసెయ్యదానికి, ఇదట్టికెళ్లి అమ్మగారిచ్చేస్తే నా నిజేయితీ మిగిలుద్ది అని అట్టుకొచ్చేసినానమ్మ. ఈ విసయం మీతోనే సెప్తున్నానమ్మా అమ్మగారితో అనమాకండమ్మా. ఆ అమ్మకి నా మీద ఎంత నమ్మకమో నాకు తెలుసు. నేను దొంగని అనుకోవడం నాకు కల్లో కూడా ఇట్టంలేదమ్మా. మీకు దండం పెడతాను. ఈ ముక్క మాత్రం మీలోనే ఉంచుకోండమ్మా. అమ్మగారికి తెలీనీకండి" ప్రాధేయపడుతూ చెప్పింది.

"పరవాలేదు నర్సమ్మా! మనిషన్నాక తప్పు చెయ్యరా ఏంటి? దాన్ని సరిదిద్దుకున్నావు అంతే చాలు. నేనెవరికీ చెప్పనులే" అంటూ పర్సులోంచి వంద కాయితం తీసి దాని చేతిలో పెట్టాను.

"అయ్యో ఇదేంటమ్మా" దెబ్బతిన్నట్లు చూసింది.

"వయసులో పెద్దదానివి, మరోలా అనుకోకు నర్సమ్మా. ఇది నీ నిజాయితీకి కాదు నీ విచక్షణకి నేనిచ్చే చిన్న కానుక. కాదనకు" అన్నాను.

నా మాట దానికేం అర్థమయిందో తెలీదు గాని "వెయ్యేళ్లు చల్లగా ఉండు తల్లీ" అంటూ పెరట్లోకి వెళ్లింది.



○